



కాలం కాని కాలంలో.. రారెత్తిస్తున్న ఎండలు

నగరంలో పగటిపూట ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో దక్షిణాది జిల్లాల్లో వరుణుడి కరుణతో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఉత్తరాది జిల్లాల్లో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కపోత, చెమటతో బాధపడుతున్నారు. నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర మీదుగా ఉత్తరదిశగా కదలడంతో దక్షిణ, పడమటి గాలులు వ్యతిరేకదిశలో వీస్తుండటంతో రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రత రోజురోజుకూ పెరిగి 40 డిగ్రీలకు చేరుతుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. తిరుచ్చిలో 39 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉదయం పది గంటల నుంచే నగరవాసులు ఉక్కపోతకు గురయ్యారు. మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నగరంలో వేడిగాలులు వీచాయి. వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. కూలీనాలీ చేసుకునే జనం ఈ ఎండవేడికి ఆపసోపాలు పడ్డారు. ఇక రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోనూ ఎండలు అధికంగానే ఉన్నాయని చెబుతున్నారు. మదురైలో ప్రస్తుత వడగాడ్పులు వీస్తున్నాయి. రాజధాని నగరం చెన్నైలో మంగళవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఐదు రోజులపాటు రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. ఆగస్టు 3 తర్వాతే చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

పులులను సంరక్షించి

అడవులను కాపాడుతున్నాం



- సీఎం స్టాలిన్ సందేశం

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వన్యమృగాలను సంరక్షించడంలో రాష్ట్ర అటవీ సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారని, ప్రత్యేకించి పులుల సంచారానికి కూడా తోడ్పడుతున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. రాష్ట్రంలో పులుల దినోత్సవం జరుపుకోవడం తనకెంతో గర్వంగా ఉందని, జాతీయ పులుల సంరక్షణ మండలి అందించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 306 పులులున్నాయన్నారు. ఈ మేరకు తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం విడుదల చేశారు. పులుల ఆవాసాలను రక్షించడంలో అటవీ సిబ్బంది, వేట నిరోధక సిబ్బంది ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అడవులను సంరక్షించడానికి డీఎంకే ప్రభుత్వం అటవీశాఖలో 19478 ఖాళీ పోస్టులను భర్తీ చేసిందని, అటవీ సిబ్బందికి ప్రత్యేకమైన దుస్తులను కూడా పంపిణీ చేసిందని, కొత్త సాంకేతిక పరికరాలను కూడా అందజేసిందని, వన్యమృగాలను రోగాలు, గాయాల బారి నుండి కాపాడేలా వాటికి చికిత్స అందించేందుకు వెటర్నరీ డాక్టర్లను కూడా నియమించామని స్టాలిన్ వివరించారు. పులులు సంచరించే మార్గాల్లో వాటికి హాని కలిగించే విషపు మొక్కలను, ముళ్ల పొదలను అటవీ సిబ్బంది నిరంతరం తొలగిస్తున్నారని తెలిపారు. వన్యప్రాణులను వేటాడేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా వన్యప్రాణుల నేర నియంత్రణశాఖ పేరుతో ప్రత్యేక శాఖ కూడా ఏర్పాటుచేశామని సీఎం పేర్కొన్నారు. పులులను కాపాడటం ద్వారా అడవుల ఆత్మ రక్షణ సాధ్యమవుతుందని స్టాలిన్ ఆ సందేశంలో తెలిపారు.

రాష్ట్రంలో 12 లక్షల మంది వలస కార్మికులు

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 11,93,297 మంది వలస కార్మికులు పనిచేస్తున్నారని కార్మిక సంక్షేమ శాఖ సర్వేలో వెల్లడైంది. చెన్నై, కోవై, తిరుప్పూర్, ఈరోడ్ తదితర జిల్లాల్లోని జౌళి, ఆటోమొబైల్, భవన నిర్మాణం, హోటళ్లు, వాచ్‌మెన్ సహా పలు ఉద్యోగాల్లో వలస కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 2,86,500, బిహార్ నుంచి 2,47,016, జార్ఖండ్ రాష్ట్రం నుంచి 1,90,518, పశ్చిమ బెంగాల్ నుంచి 1,84,960 కార్మికులు పనిచేస్తున్నారు. అలాగే, చండీఘడ్, తెలంగాణా, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, పుదుచ్చేరి, మిజోరాం తదితర రాష్ట్రాలకు చెందిన వారు 500 నుంచి వెయ్యి మంది, జమ్ము కశ్మీర్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవులు, డయ్యూ డామన్, లడాక్, లక్ష్యద్వీప్ తదితర రాష్ట్రాలకు చెందిన 20 నుంచి 500 మంది వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పని చేస్తున్నారు. కార్మిక సంక్షేమ శాఖ నమోదుచేసిన వివరాల ఆధారంగా ఈ సంఖ్య ఉందని, నమోదు చేసుకోని వారు మరింత మంది ఉన్నారని అధికారులు తెలిపారు. కాగా, ఇటీవల గుమ్మిడిపూండిలో బాలికపై ఉత్తరాదికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడడంతో పాటు చోరీలు, గంజాయి, మాదకద్రవ్యాల తరలింపు అధికంగా ఉత్తరాది వాసులు నిందితులుగా ఉండడంతో కార్మిక సంక్షేమ శాఖ రాష్ట్రంలో ఉత్తరాది కార్మికుల గణన చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మా కూటమిలోనే బీజేపీ

- ఎన్నికల సమయంలో మరిన్ని పార్టీలు
- ఈపీఎస్


మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 'మా కూటమిలోనే బీజేపీ ఉంది, అదే సమయంలో బీజేపీతో పలు ప్రాంతీయ పార్టీలు చేతులు కలిపాయి. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తర్వాత కూటమిపై స్పష్టత వస్తుంది. ఎన్నికలకు మరో 8 నెలలు మాత్రమే ఉన్నందున ఆలోగా మరిన్ని పార్టీలు మా కూటమిలోకి వస్తాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మక్కళై 'కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా మంగళవారం శివగంగ జిల్లాలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. నగరం నుంచి విమానంలో తిరుచ్చి చేరుకున్న ఈపీఎస్‌కు విమానాశ్రయంలో మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 7న కోవై జిల్లా మేట్టుపాళయంలో ప్రారంభించిన తన పర్యటనకు జనాదరణ లభించిందన్నారు తాము అధికారంలో ఉన్నా, లేకున్నా.. ప్రజల తరుపున పోరాడేందుకు ముందుంటామన్నారు. 1976లో ఎమర్జెన్సీ విధించిన సమయంలో విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చారని, ఆ తర్వాత పలుమార్లు కేంద్రంలో అధికారంలో కొనసాగిన సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యం వహించిన డీఎంకే తన కున్న అధికారంతో విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చకుండా విద్యార్థులకు మొండిచెయ్యి చూపించిందని ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం అన్నాడీఎంకే ఉందని, అయితే బీజేపీతో పలు ప్రాంతీయ పార్టీలు చేతులు కలిపాయని, మరో 8 నెలల్లో కూటమిలో చేరిన పార్టీల వివరాలను స్పష్టంగా వెల్లడిస్తామని ఈపీఎస్ తెలిపారు.

రాష్ట్రంపై మోదీ- అమిత్ షా చిన్న చూపు

- ఓపీఎస్ ఆగ్రహం


ఓ. పన్నీర్‌సెల్వం

అడయార్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకూ బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి, అది కుదరక తీవ్ర మనస్తాపంతో వున్న అన్నాడీఎంకే బహిష్కృతనేత ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) తాజాగా తన అక్కసు వెళ్లగక్కారు. గతంలో ఏనాడూ కేంద్రప్రభుత్వాన్ని గానీ, బీజేపీగానీ పల్లెత్తుమాట అనని ఆయన.. తాజాగా రాష్ట్రానికి రావాల్సిన ఎస్ఎస్ఏ నిధులు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం చెందారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్రం చర్యల వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందన్నారు. అనేక ప్రైవేటు విద్యా సంస్థలు నిధుల సంక్షోభంలో కూరుకుపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద తమిళనాడు రాష్ట్రానికి 2024-25 సంవత్సరానికి గాను రూ.2151కోట్లు ఇవ్వాల్సి ఉందని, అయితే, నూతన జాతీయ విద్యా విధానం (త్రిభాషా విద్యావిధానం) అమలుకు తమిళనాడు ప్రభుత్వం సమ్మతించకపోవడం వల్లే నిధులను నిలిపివేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారని ఓపీఎస్ గుర్తు చేశారు. ఈ పథకాన్ని నమ్ముకుని రాష్ట్రంలో 65 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ పథకం నిధులను నిలిపివేయడంతో అనేక ప్రైవేటు పాఠశాలలు నిధుల కొరత ఎదుర్కోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ, పాఠశాలల్లో చేపట్టే పారిశుధ్య పనులకు స్తంభించిపోతాయన్నారు. అంతేకాకుండా, కేంద్రం మొండి వైఖరి కారణంగా విద్యా హక్కు చట్టం కింద ఈ యేడాది ప్రైవేటు పాఠశాలల్లో చేరాల్సిన 25 శాతం మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ విద్యా హక్కు చట్టంలో ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ కూడా అంధకారంలో పడుతుందన్నారు. నూతన విద్యా విధానంపై కేంద్రం పెట్టిన షరతులకు రాష్ట్రం అంగీకరించకపోవడం అనేది కేంద్ర రాష్ట్రాల సమస్య అని అన్నారు. దీన్ని ఓ సాకుగా చూపి రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయకపోవడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. అందువల్ల సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద 2024-25 సంవత్సరానికి విడుదల చేయాల్సిన రూ.2151 కోట్లను తక్షణం విడుదల చేయాలని అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నట్టు ఓపీఎస్ వెల్లడించారు.

ప్రాణం మీదకు తెచ్చిన

ప్రేమ వ్యవహారం

- రాజీకి వెళ్లిన విద్యార్థి హతం
- కారుతో ఢీకొట్టించి హత్య చేసిన దుండగులు


హత్యకు గురైన నితిన్‌సాయి (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడి ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు వెళ్లిన ఓ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. కారుతో ఢీకొట్టించి మరీ దుండగులు అతడిని పొట్టనపెట్టుకున్నారు. అన్నానగర్ తిరుమంగళం ప్రాంతంలో సోమవారం అర్ధ రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ... అయనావరం ముత్తమ్మన్ వీధిలో నివసిస్తున్న నితిన్‌సాయి (21) నగరంలోని ఓ కాలేజీలో చదువుతున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు అభిషేక్‌తో కలిసి బైకుపై వెళ్తుండగా తిరుమంగళం స్కూలు రోడ్డు వద్ద వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో నితిన్‌సాయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైకు నడిపిన అభిషేక్ తీవ్రంగా గాయపడి కేఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.. ఓ యువతి ప్రేమవిషయమై ఏర్పడిన తగాదా నేపథ్యంలో నితిన్‌సాయిని కారుతో ఢీకొట్టించి హత్య చేసినట్లు తెలియడంతో పోలీసులు హత్యకేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. నితిన్‌సాయి స్నేహితుడు వెంకటేష్ ఓ అమ్మాయిని ప్రేమించాడని, తరచూ ఆమె వెంటబడుతుండేవాడని, ఈ విషయం నచ్చక ఆ అమ్మాయి తన బాయ్‌ఫ్రెండ్ ప్రణవ్‌కు చెప్పింది. దీంతో వెంకటేష్‌కు ప్రణవ్ ఫోన్ చేసి అమ్మాయిని ప్రేమపేరుతో వేధిస్తే పద్ధతిగా ఉండదని బెదిరించాడు. ఈ విషయాన్ని వెంకటేష్ తన స్నేహితుడైన నితిన్‌సాయికి చెప్పి సాయం కోరాడు. ఈ నేపథ్యంలో నితిన్‌సాయి ప్రేమ వ్యవహారాన్ని చక్కదిద్దాలని ప్రణవ్‌ను కలుసుకునేందుకు తిరుమంగళంకు బైకుపై వెళ్లినప్పుడు ప్రణవ్ అనుచరులు కారుతో బైకును ఢీకొట్టించి నితిన్‌సాయిని హతమార్చాడని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ హత్యకు పాల్పడిన వ్యక్తి కేకేనగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ రాజకీయనేత బంధువని పోలీసు విచారణలో తెలిసింది.


కారు ఢీకొనటంతో ధ్వంసమైన బైకు

కాలం మారినా కమ్యూనిస్టులు మారలేదు




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి తంగం తెన్నరసు

- మంత్రి తంగం తెన్నరసు ప్రశంస

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాలం మారినా కమ్యూనిస్టులు ఏమీ మారలేదని రాష్ట్ర ఆర్థిక, పశు సంవర్ధక, పర్యావరణ శాఖ మంత్రి తంగం తెన్నరసు వ్యాఖ్యానించారు. 'న్యూ సెంచూరి' సంస్థ ఆధ్వర్యంలో కామరాజర్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో, రచయిత జీవా భారతి రచించిన 'కాలాతీతంగా కమ్యూనిస్టులు' అనే గ్రంథం (రెండు భాగాలు) ఆవిష్కరించిన మంత్రి తంగం తెన్నరసు, తొలి భాగాన్ని తవతిరు కుంద్రకుడి పొన్నంబల్ అడిగళార్‌కు, రెండో భాగాన్ని రచయిత వైరముత్తుకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు నేటికీ త్యాగాల బాటలో పయనిస్తున్నారని, కాలం మారినా కమ్యూనిస్టులు మారలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించి వందేళ్లు గడించిందన్నారు. కమ్యూనిస్టులు ప్రజలు, దేశ సంక్షేమం కోసం పాటుపడతారన్నారు. తెల్లదొరతనానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టులు, ప్రస్తుతం ప్రజలను విభజించి సమాజంలో తారతమ్యాలు సృష్టిస్తున్న వారికి వ్యతిరేకంగా, ప్రజలకు రక్షణ కల్పించేలా పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. మతాల పేరిట ఘర్షణ సృష్టించే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని, హిందూ-ముస్లిం మధ్య దూరాన్ని పెంచి విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు జోరందుకున్నాయని విమర్శించారు. ప్రజలను విభజించేందుకు మతాన్ని ఎందుకు వాడుతున్నారో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంటులో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంద్రకుడి పొన్నంబల్ అడిగళార్ మాట్లాడుతూ... శైవ సిద్ధాంతం ఆధ్యాత్మిక వాదాల నుంచి వైవిధ్య భరితమైన సమాజాన్ని అందించాలన్నదే మార్క్సిజం లక్ష్యమన్నారు. శైవ సిద్ధాంతం, కమ్యూనిజ జీవన విధానానికి దోహదపడేవన్నారు. రచయిత వైరముత్తు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎన్నో అటుపోట్లకు గురైన పార్టీ సీపీఐ అన్నారు. రష్యా విప్లవం అనంతరం బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్‌ను చూసి భయపడలేదని, కమ్యూనిస్ట్ పార్టీని చూసి భయపడిందన్నారు. దేశానికి కమ్యూనిజం అవసరం ఎంతో ఉందని, అందువల్లే ఆ పార్టీని అంతమొందించలేరన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ సహా పలువురు పాల్గొన్నారు.

'కలైంజర్' నెలవారి పింఛన్ కోసం 5.88 లక్షల దరఖాస్తులు

అడయార్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'కలైంజర్ మగళిర్ ఉరిమై తొగై' (కలైంజర్ మహిళా సాధికార పింఛన్) కోసం కొత్తగా 5.88 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే చేర్చేలా 'ఉంగలుడన్ స్టాలిన్' అనే పథకాన్ని గత నెల 15న సీఎం స్టాలిన్ కడలూరు జిల్లా చిదంబరంలో ప్రారంభించారు. ఈ శిబిరాల్లో మొత్తం 12 శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్నారు. ఈ వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణం చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, ఒక సమస్యపై గరిష్ఠంగా 45 రోజుల్లో పరిష్కారం చూపిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 12.65 లక్షల వినతులను స్వీకరించగా, వీటిలో 5.88 లక్షల వినతులు మాత్రం కలైంజర్ ఉరిమై తొగై కోసం సమర్పించినవి కావడం గమనార్హం.

సమాచార దర్శిని

9న తాంబరం జిల్లా ఆస్పత్రి ప్రారంభం

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాంబరం శానిటోరియం ప్రాంతం వద్ద రూ.137 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఈ నెల 9న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఆ సందర్భంగా జరిగే సభలో 25 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దామో అన్బరసన్, శాసనసభ్యులు ఇ.కరుణానిధి, చెంగల్పట్టు వరలక్ష్మి మధుసూదనన్, మేయర్ వసంతకుమారి తదితరులు పాల్గొంటారు.

రేపు చాక్లెట్ల తయారీపై శిక్షణ

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సీపెట్ కళాశాల ఎదురుగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ శిక్షణా కేంద్రంలో గురువారం చాక్లెట్ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. సాధారణ చాక్లెట్లు, కుకుంబర్స్ చాక్లెట్లు, అరేబియన్ నట్స్ సహా పలురకాల చాక్లెట్ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్నవారు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

'తమిళ్‌సెమ్మల్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 'తమిళ్ సెల్వం' పురస్కారానికి ఆగస్టు 29వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.... తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'తమిళ్ సెల్వం' పురస్కారం కింద జిల్లాకు ఒకరిని ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాది పురస్కారానికి https://tamilvalarchithurai.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, జిల్లా తమిళ అభివృద్ధి శాఖ కార్యాలయాలను సంప్రదించవచ్చు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, తమిళ భాషాభివృద్ధికి చేస్తున్న కృషి తదితర వివరాలతో ఆగస్టు 29వ తేది లోపు దరఖాస్తులు సమర్పించాలని ప్రకటనలో తెలిపింది.

30 పైసలు తగ్గిన కోడిగుడ్డు ధర

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లో కోడిగుడ్ల ధరలు 30 పైసలు తగ్గి రూ.4.20కి విక్రయమవుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో స్వర్ణ పండుగలు జరుగుతున్న సందర్భంగా ఆ రాష్ట్రాలకు కోడిగుడ్ల ఎగుమతులు తగ్గిపోయాయి. కోళ్లఫారంలలో కోడి గుడ్ల నిల్వలు పెరగడంతో, సోమవారం రూ.4.50గా ఉన్న ధరను 30 పైసలు తగ్గిస్తూ రూ.4.20గా నిర్ణయించారు. కాగా, రెండు రోజుల్లో కోడి గుడ్డు ధర 60 పైసలు తగ్గడం గమనార్హం.

సెప్టెంబరు 18 నుంచి త్రైమాసిక పరీక్షలు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళిక కింద పనిచేస్తున్న పాఠశాలలకు త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షల టైంటేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో, త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షల టైంటేబుల్ మంగళవారం విడుదలైంది. ఆ ప్రకారం, త్రైమాసిక పరీక్షలు సెప్టెంబరు 18 నుంచి 26వ తేది వరకు జరుగనున్నాయి. 27 నుంచి తొలి త్రైమాసిక సెలవులు ప్రకటించారు. అలాగే, డిసెంబరు 15 నుంచి 23వ తేది వరకు అర్ధవార్షిక పరీక్షలు నిర్వహించి, 24 నుంచి అర్ధవార్షిక సెలవులుంటాయని ప్రకటించారు. 2025-26 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ అక్టోబరులో విడుదల చేయనున్నారు. త్రైమాసిక, అర్ధవార్షిక పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా సిద్ధం కావాలని మంత్రి అన్బిల్ మహేష్ పిలుపునిచ్చారు.

కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... గత విద్యా సంవత్సరం ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు, మరో సంవత్సరం నష్టపోకుండా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశామన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాలల్లో మొదటి సంవత్సరం దరఖాస్తు స్వీకరణ, కౌన్సెలింగ్ ముగిసి తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో, ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో చేరేందుకు అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని మంత్రి చెళియన్ విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.03251 ధనాపూర్- బెంగళూరు (పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట) స్పెషల్ (ఆది, సోమవారం) ఆగస్టు 3 నుంచి 25వ తేది వరకు 8 సర్వీసులు, మరుమార్గంలో, నెం.03252 బెంగళూరు-ధనాపూర్ స్పెషల్ (మంగళ, బుధవారం) ఆగస్టు 5 నుంచి 27వ తేది వరకు 8 సర్వీసులు పొడిగించారు.
- నెం.03259 ధనాపూర్- బెంగళూరు (పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట) స్పెషల్ ఆగస్టు 5 నుంచి 16వ తేది (మంగళవారం) వరకు 4 సర్వీసులు, మరుమార్గంలో, నెం.03260 బెంగళూరు-ధనాపూర్ స్పెషల్ ఆగస్టు 7 నుంచి 28వ తేది వరకు (గురువారం) వరకు 4 సర్వీసులుగా పొడిగించారు.

రేపు సెంట్రల్-సూళ్లూరుపేట మధ్య 14 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లో గుమ్మిడిపూండి-పొన్నేరి రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా గురువారం చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట మధ్య 14 రైళ్లు రద్దుచేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 8.50, 9, 9.30, 10.30, 11.35 గంటలకు గుమ్మిడిపూండికి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 9.10, 9.55. 11.25, మధ్యాహ్నం 12, ఒంటి గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. సెంట్రల్ నుంచి ఉదయం 10.15 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే మెము రైలు, సూళ్లూరుపేట నుంచి ఉదయం 10 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే మెము రైళ్లు రద్దు చేశారు. అలాగే, చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40 గంటలకు గుమ్మిడిపూండి, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.40 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్లు...

ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ నుంచి పొన్నేరికి ఉదయం 8.50, 9, 9.30 గంటలు, పొన్నేరి నుంచి సెంట్రల్‌కు ఉదయం9.27, 10.23 గంటలకు, పొన్నేరి నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 11.13, చెన్నై బీచ్ నుంచి మీంజూరుకు ఉదయం 9.40, చెన్నై సెంట్రల్ నుంచి ఎర్నావూర్‌కు ఉదయం 10.30, ఎర్నావూర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.43, చెన్నై సెంట్రల్ నుంచి మీంజూరుకు ఉదయం 11.35, మధ్యాహ్నం 1.31, సూళ్లూరుపేట నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

పన్ను వసూళ్లలో రూ.150 కోట్ల అవినీతి వ్యవహారం

● మదురై కార్పొరేషన్ సమావేశంలో అన్నాడీఎంకే నిరసన



నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకే కార్పొరేటర్లు

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్‌లో పన్ను వసూళ్లలో రూ.150 కోట్ల మేర అవినీతి జరిగిన నేపథ్యంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అన్నాడీఎంకే కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. మదురై కార్పొరేషన్‌లోని ఐదు జోన్లలో వంద డివిజన్లున్నాయి. అక్కడున్న వాణిజ్య సముదాయ భవనాలకు నిర్ణయించిన పన్ను కంటే తక్కువ పన్ను విధించినట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి జరిపిన విచారణలో కార్పొరేషన్‌కు రూ.150 కోట్లు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ అప్పటి కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన దినేష్ కుమార్ కేంద్ర ఆర్థిక నేర విభాగానికి ఫిర్యాదు చేశారు. పన్ను అవినీతిలో సంబంధాలున్న రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ రెవెన్యూ అధికారి సహా 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో, ఈ అవినీతిలో డీఎంకేకు చెందిన జోన్ చైర్మెన్లకు సంబంధాలున్నాయని ప్రతిపక్షానికి చెందిన కార్పొరేటర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, ఐదుగురు జోన్ చైర్మెన్, ఇద్దరు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈ నెల 12న సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు ఈ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 55 మందిని విచారణ జరిపిన అనంతరం అవినీతికి పాల్పడిన మొత్తం 14 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇదిలా వుండగా మేయర్ ఇంద్రాణి అధ్యక్షతన మదురై కార్పొరేషన్ సమావేశం జరిగింది. అన్నాడీఎంకే-బీజేపీ సభ్యులు నల్ల దుస్తులు ధరించి సమావేశంలో పాల్గొని మేయర్ పోడియంను ముట్టడించి నినాదాలు చేశారు. సమావేశం జరగకుండా ఆటంకం కలిగించిన కార్పొరేటర్లను మేయర్ ఉత్తర్వుల మేరకు మార్షల్స్ బయటకు గెంటివేశారు.

రూ.34 లక్షల పన్ను బకాయిలు

● డీఎంకే కార్యాలయానికి తంజావూరు కార్పొరేషన్ నోటీసు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తంజావూరు ముత్తుకుమార మూపనార్ రోడ్డులో 'కలైంజర్ అరివాలయం' పేరుతో డీఎంకే జిల్లా కార్యాలయం ఉంది. ఈ క్రమంలో, 2010 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను రూ.34,46,396 బకాయి పడింది. ఈ బకాయిలను 15 రోజుల్లోపు చెల్లించాలని కలైంజర్ అరివాలయానికి కార్పొరేషన్ నోటీసు పంపింది. ఈ విషయమై డీఎంకే స్థానిక నాయకులు మాట్లాడుతూ... వాణిజ్య వినియోగ పన్ను చెల్లించాలని కార్పొరేషన్ నోటీసు పంపిందన్నారు. అరివాలయంలో సాధారణ ప్రజలు వినియోగించుకొనేలా గ్రంథాలయం ఉందని, అందువల్ల వాణిజ్య వినియోగ పన్ను మాఫీ చేయాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశామని, పన్ను తగ్గిస్తే బకాయి చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని డీఎంకే నాయకులు తెలిపారు.

సెంథిల్ బాలాజీ మినహా ఎవరెవరికి సంబంధాలున్నాయి...?

● ఘాటుగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రెండు వేలు నుంచి 2,500 మందిని విచారిస్తే, మంత్రి జీవితకాలం ఈ కేసు విచారణ పూర్తికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రవాణా శాఖలో ఉద్యోగాల పేరిట లంచం తీసుకున్నారంటూ, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా నమోదైన కేసులో సుప్రీంకోర్టు ఘాటుగా ప్రశ్నించింది. రవాణా శాఖలో ఉద్యోగాలకు లంచం తీసుకున్న కేసులో సెంథిల్ బాలాజీ మినహా, మధ్యవర్తులు, బ్రోకర్లు ఎవరెవరికి సంబంధాలున్నాయి? లంచం తీసుకుని నియమాకపత్రాలు అందించిన అధికారులు ఎవరు? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఒక్కో కేసులో 900, 1,000 మంది నేరారోపణలు ఎదుర్కొంటున్న వారుంటే, కేసు విచారణ ఎప్పటికి పూర్తవుతుంది? ఇలాగే కొనసాగితే, ఎన్ని సంవత్సరాలు గడిచినా ఈ కేసు ముగిసే అవకాశం లేదు? అంటూ వ్యాఖ్యానించింది. అలాగే, లంచం ఇచ్చిన వారు, నిందితులు 2,000 నుంచి 2,500 మందిని విచారించడం కష్టం. 2 వేల నుంచి 2,500 మందిని విచారిస్తే, మంత్రి జీవితకాలం ఈ కేసు విచారణ ముగింపు రాదన్న అత్యున్నత న్యాయస్థానం, పైన పేర్కొన్న నిందితులను ఇరికించడమే మీ ప్రయత్నంగా ఉందని, ఇది వ్యవస్థపై జరిగిన మోసం అని ఘాటుగా వ్యాఖ్యానించింది.


1 నుంచి గ్యాస్ ట్యాంకర్ లారీల సమ్మె



ఐఓసీ గ్యాస్ ట్యాంకర్ లారీలు

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)ప్లాంట్ల నుంచి నడుపుతున్న గ్యాస్ ట్యాంకర్లు 15 డిమాండ్లతో ఆగస్టు 1వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటాయని తమిళనాడు ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ల యజమానుల సంఘం అధ్యక్షుడు సెంథిల్ సెల్వన్ పేర్కొన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి సహా 12 ప్రాంతాల్లో ఐఓసీ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్లున్నాయి. వీటి నుంచి లోడు తో వెళ్ళే ట్యాంకర్లకు ఒప్పందం ప్రకారం లోడు అప్పజెప్పడం లేదని, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించారని పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తున్నారని సెంథిల్ సెల్వన్ మంగళవారం మీడియాకు తెలిపారు. తన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పెరుందురైలో ఐఓసీ అధికారులతో జరిగిన చర్చలు ఫలించలేదని దీంతో సంఘం తరుపున తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సమ్మెలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. సమ్మె కారణంగా వెయ్యి లారీలను నడిపే ప్రసక్తే లేదని, అందువల్ల రోజుకు రూ.34 కోట్ల ఆదాయానికి గండి పడే అవకాశముందన్నారు.

విద్యార్థినికి టీవీకే ఆర్థికసాయం



బాలికకు చెక్కు అందజేస్తున్న టీవీకే నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు సమీపంలోని వీరరాఘవపురంలో ఓ బాలికకు టీవీకే నాయకులు ఆదుకున్నారు. తండ్రిని కోల్పోయిన 9వ తరగతి బాలికకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) మండల అధ్యక్షుడు వెల్‌మణి రూ.5వేల స్కాలర్‌షిప్ చెక్కును మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పార్టీ అధినేత దళపతి విజయ్ పేద కుటుంబాల విద్యార్థులకు సహాయంగా రూ.5వేల స్కాలర్‌షిప్‌లను అందజేయమని పిలుపునిచ్చారని, ఈ నేపథ్యంలో, తండ్రిని కోల్పోయిన బాలికకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించామని తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసు...

పోక్సో కోర్టులో నిందితుడి హాజరు

● 4 రోజుల కస్టడీకి మేజిస్ట్రేట్ ఉత్తర్వు



తిరువళ్లూరు పోక్సో న్యాయస్థానానికి వచ్చిన నిందితుడు రాజుబిశ్వవర్మ

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం ఆరంబాక్కం వద్ద బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో అరెస్టయిన యువకుడిని పోలీసులు తిరువళ్లూరు పోక్సో న్యాయస్థానంలో మంగళవారం ఉదయం హాజరుపరచగా, నిందితుడికి నాలుగు రోజల కస్టడీ విధించారు. ఆరంబాక్కంలో ఈ నెల 12న బామ్మ ఇంటికి ఒంటరిగా నడచి వెళుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉత్తరాది యువకుడు రాజుబిశ్వవర్మను ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరు పేట రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతడికి వైద్యపరీక్షలు జరిపిన మీదట పూందమల్లి మహిళా కోర్టులో హాజరుపరచగా, జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేయడంతో పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో నిందితుడిని ఏడురోజులపాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపే నిమిత్తం ఆరంబాక్కం పోలీసులు తిరువళ్లూరు పోక్సో న్యాయస్థానంలో పిటిషన్ వేయగా, మంగళవారం విచారణ జరిగింది. ఆ విచారణ కోసం నిందితుడు రాజుబిశ్వ వర్మను గట్టి భద్రతా ఏర్పాట్ల నడుమ పోలీసులు తిరువళ్లూరు పోక్సో న్యాయస్థానం మేజిస్ట్రేట్ ఉమామహేశ్వరి ఎదుట హాజరుపరిచారు. ఆ తర్వాత నిందితుడిని నాలుగు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపేందుకు ఆమె ఉత్తర్వు జారీ చేశారు.

చదురగిరిలో కార్చిచ్చు

● భక్తుల రాకపోకలపై నిషేధం



చదురగిరి అటవీ మార్గంలో వ్యాపిస్తున్న మంటలు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చదురగిరి అటవీ ప్రాంతంలో మూడు రోజులకు ముందు చెలరేగిన కార్చిచ్చు మంగళవారం ఉదయం తీవ్రరూపం దాల్చింది. దీంతో ఆ కొండ మీద ఆలయానికి భక్తులు వెళ్ళకుండా అటవీ శాఖ అధికారులు నిషేధం విధించారు. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపం పడమటి కనుమల్లో ఉన్న చదురగిరి సుందర మహాలింగం స్వామివారిని అమావాస్య, పౌర్ణమి పర్వ దినాలలో భక్తులు వేల సంఖ్యలో దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25న చదురగిరి ఆలయం ఉన్న పర్వతంలో ఓ వైపు కార్చిచ్చు చెలరేగింది. సాపటూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో వరుసనాడు మీదుగా చదురగిరికి వెళ్లే మార్గంలో ఈ కార్చిచ్చు మంగళవారం ఉదయం నుండి తీవ్ర రూపం దాల్చింది. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక దళం ఫైరింజన్లతో వెళ్ళి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా కానీ కార్చిచ్చు తగ్గకుండా మరిన్ని ప్రాంతాలకు వ్యాపించింది. దీనితో మంగళవారం చదురగిరి పైకి వెళ్లడానికి భక్తులను అనుమతించకుండా అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టం చేయడంతో భక్తులు తీవ్ర నిరాశ చెంది తిరుగుముఖం పట్టారు.

ఆరు శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు రూ.7 కోట్లు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి, అడయార్ మండలాల్లోని ఆరు శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు రూ.7 కోట్లు కేటాయించారు. అడయార్ మండలం 168 వార్డు, గిండి మంజుచోలై ప్రాంతంలో దహన సంస్కారాలకు ఖాళీ స్థలం ఉంది. ఈ ప్రాంతంలో రూ.2.70 కోట్లతో గ్యాస్ శ్మశానవాటిక నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. అలాగే, గిండి సిడ్కో ప్రాంగణం, అరుళాయన్‌పేటలోని శ్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణకు రూ.2.81 కోట్లు కేటాయించింది. ఇక, 170వ వార్డు సూర్య నగర్, 178వ వార్డు భారతి నగర్, 180వ వార్డు తిరువళ్లువర్‌నగర్‌లోని శ్మశానవాటికల అభివృద్ధికి రూ.1.50 కోట్లు కేటాయించింది. ఆరు శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది.

అక్రమ వసూళ్లు రద్దు చేయాలి

● లారీ యజమానుల ఫెడరేషన్ డిమాండ్

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ, యూనియన్ పంచాయతీల్లో సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వెళ్ళే భారీ వాహనాల నుంచి లీజుదారుల ముసుగులో అక్రమ సుంకాల వసూళ్లను రద్దుచేయాలని తమిళనాడు లారీ యజమానుల ఫెడరేషన్ (ఎస్ఎల్‌వోఎఫ్‌టీ)రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్ఎల్‌వోఎఫ్‌టీ-తమిళనాడు, మోటారు వెలిచమ్ సంయుక్తంగా మంగళవారం తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పెద్దికుప్పం జంక్షన్‌లో నిర్వహించిన ధర్నాలో తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన లారీ యజమానుల సంఘాల ప్రతినిధులు, క్లీనర్లు, మోటారు వాహన పరిశ్రమల సిబ్బంది పాల్గొన్నారు. మోటారు వెలిచమ్ అధ్యక్షుడు లయన్ వీజీ.జయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో ఆలిండియా మోటారు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ చైర్మెన్ జీఆర్.షణ్ముగప్ప, సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ వైవీ.ఈశ్వరరావు, ఎస్ఎల్‌వోఎఫ్‌టీ అధ్యక్షుడు సి.ధన్‌రాజ్, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పప్పు లక్ష్మీనారాయణ, నిర్వాహకులు కె.కోనా, వై.కొండస్వామి, ఎస్కే షఫి సహా నెల్లూరు, ప్రకాశం, కృష్ణా తదితర జిల్లాల లారీ యజమానులు పాల్గొన్నారు.

న్యాయవాది వాంచినాథన్‌పై

కోర్టుధిక్కార చర్యలు

● సీజేకి హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ సిఫారసు



తన సహచరులతో కోర్టుకు వెళ్తున్న న్యాయవాది వాంచినాథన్ (తెల్లచొక్కా ధరించిన వ్యక్తి)

టి.నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తులను, న్యాయవ్యవస్థను విమర్శిస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన న్యాయవాది వాంచినాథన్‌పై కోర్టు ధిక్కార చర్య తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ కె.రాజశేఖర్‌తో కూడిన మదురై ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తికి సిఫారసు చేసింది. మదురై ధర్మాసనంలోని న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ కుల తత్వ ధోరణితో ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవాది వాంచినాథన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాత పూర్వకంగా ఫిర్యాదు పంపారు. ఆ ఫిర్యాదుకు సంబంధించిన వివరాలు వాంచినాథన్ కామెంట్లతో న్యాయవాదుల వాట్సప్ గ్రూపుల్లో తీవ్రంగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తంజావూరు తమిళ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ నియామకానికి సంబంధించిన అప్పీలు పిటిషన్‌పై మరోమారు సోమవారం విచారణ జరగ్గా.. వాంచినాథన్ కూడా హాజరై వివరణ ఇచ్చారు. దీనిపట్ల ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయవాది వాంచినాథన్ సరైన సమాధానం చెప్పడానికి ఆసక్తికనబరచలేదని అభిప్రాయపడింది. న్యాయమూర్తి గురించి, న్యాయవ్యవస్థ గురించి వాంచినాథన్ విమర్శలు, వ్యాఖ్యలు చేయడాన్ని కోర్టు ధిక్కారంగానే భావించి, ఈ విషయంలో హైకోర్టుప్రధాన న్యాయమూర్తి తదుపరి చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది.

మహిళ హత్య కేసులో రౌడీ అరెస్ట్

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపంలోని తిమ్మసముద్రం పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లోని ఓ ఇంట్లోకి చొరబడి నగలు దోచుకుని, మహిళను దారుణంగా హతమార్చిన రౌడీని మూడు రోజుల అనంతరం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన సురేష్ చెంగల్పట్టులో ఉన్న ప్రభుత్వ అతిథి గృహంలో వాచ్‌మన్‌గా, ఆయన భార్య అశ్విని (29) ఒరగడంలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం ఉద్యోగం నుంచి రాత్రి 10 గంటలకు అశ్విని ఇంటికెళ్ళిన సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండటం చూసి లోపలికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో అశ్విని స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత దుండగులు బీరువాలోని నగలు దోచుకుని పరారైనట్లు తెలిసింది. ఆదివారం ఉదయం సురేష్ భార్య సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తే అవతల నుంచి సమాధానం లేకపోవడంతో ఆయన తన ఇంటికి చేరుకున్నాడు. అక్కడ రక్తపు మడుగులో స్పృహ లేకుండా పడివున్న అశ్విని‌ని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి కాంచీపురంలో రౌడీగా చెలామణి అయిన తమిళ్‌వానన్ (25)ని అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో అశ్విని‌ని తన మిత్రుడితో కలిసి హత్యచేసినట్లు నేరాన్ని అంగీకరించాడు. అతడితో కలిసి హత్యచేసి పరారైన మరో రౌడీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రుణం పొందిన స్నేహితుడు మృతి

● జామీనుగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడు తీసుకున్న రుణానికి జామీనుగా సంతకం చేసిన వ్యక్తి నుంచి నగదు జమచేయడంతో, మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. నైవేలీకి చెందిన ఆరోగ్యదాస్ (56)-లీమా రోజ్ దంపతులున్నారు. ఆరోగ్యదాస్ ఎన్ఎల్‌సీ లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకోగా, ఆరోగ్యదాస్ జామీనుగా సంతకం చేశాడు. ఈ నేపథ్యంలో, ఆరోగ్యదాస్ స్నేహితుడు అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందాడు. దీంతో, అతను పొందిన రుణానికి నెలవారీ వాయిదా ఆరోగ్యదాస్ బ్యాంక్ ఖాతా నుంచి సదరు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ జమచేసుకున్నట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన ఆరోగ్యదాస్ సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపుల కేసులో ఇంటి యజమానికి 20 ఏళ్ల జైలుశిక్ష

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇంటి యజమానికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. చెంగల్పట్టు జిల్లా సేలయూరు పోలీస్ స్టేషన్ పరిధిలో భర్త వదిలేయడంతో ఏడేళ్ల కుమార్తెతో తల్లి ఓ ఇల్లు అద్దెకు తీసుకుంది. ఇంటి పనులకు వెళ్తున్న తల్లి, కుమార్తెను ఇంటి యజమాని బాలాజీ ఇంట్లో వదిలి వెళుతుండేది. 2022 అక్టోబరులో బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో బాలాజీ ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడి, ఈ విషయం ఎవరికైనా చెబితే, మిమ్మల్ని ఇంట్లో నుంచి తరిమేస్తానని బెదిరించినట్లు సమాచారం. ఆ తరువాత కూడా పలుమార్లు బాలికను లైంగిక వేధింపులకు గురిచేశాడు. అతని వేధింపులు తట్టుకోలేని బాలిక, ఈ విషయాన్ని తల్లితో చెప్పగా ఆమె, సేలయూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై విచారించి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, బాలాజీని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో, బాలాజీపై నేరారోపణలు రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ చెంగల్పట్టు పోక్సో కోర్టు న్యాయమూర్తి నసీమాభాను తీర్పు వెలువరించారు. అలాగే, ఈ కేసులో బాధిత బాలికకు పరిహారంగా రూ.4 లక్షలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

కరాటే తెలిసిన బాలిక... లైంగిక వేధింపుల నుంచి రక్షణ

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓ సీఆర్పీఎఫ్ జవాను కుమార్తెకు కరాటే నేర్పించడంతో ఆ బాలిక తనపై లైంగిక దాడి జరగకుండా తప్పించుకుంది. స్థానిక ఆవడి సీఆర్పీఎఫ్ కాలనీలో ఓ జవాను కుమార్తెపై సురేష్‌కుమార్ అనే సీఆర్పీఎఫ్ జవాను లైంగిక వేధింపులకు పాల్పడగా, కరాటే తెలిసిన బాలిక అతనిపై దాడిచేసి తప్పించుకుంది. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పగా, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన ఆవడి పోలీసులు సురేష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

బైక్‌పై వెళ్తున్న యువకుడిపై దాడి

● నిందితుల కోసం గాలింపు

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతున్న యువకుడిపై నలుగురు దుండగులు దాడికి పాల్పడిన ఘటన తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన వడివేలు కుమారుడు పవన్‌కుమార్ సోమవారం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై వెళ్తుండగా, పాత కక్షలతో నలుగురు యువకులు అతడిపై ఒక్కసారిగా కత్తులతో దాడి చేసి హతమార్చబోయారు. పవన్‌కుమార్ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు రావడంతో ఆ దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో గ్రామస్తులు యువకుడిని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని జరిపిన విచారణలో దాడికి పాల్పడ్డ నిందితులు సీఆర్‌పేటకు చెందిన ప్రశాంత్ (21), బోస్ (27), బాలాజీ (25), విఘ్నేష్ (22)లుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ చరిత్రలో మైలురాయి

● డీఎంకే ఎంపీ విల్సన్

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించడం సామాజిక న్యాయ చరిత్రలో మైలురాయని డీఎంకే రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది పి.విల్సన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి. 2021 జూలై 21 ఆలిండియా వైద్య విద్యార్థుల అడ్మిషన్లలో ఓబీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం శుభపరిణామమని అని తెలిపారు. డీఎంకే అధ్యక్షుడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషిచేయడంతో పాటు ఉన్నత విద్యలో వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు చేరి చదువుకునేందుకు తోడ్పడుతున్నారని విల్సన్ ప్రశంసించారు.

గ్రామాల్లో దుకాణాలకు వృత్తి పన్ను రద్దుచేయాలి

● పీఎంకే నేత అన్బుమణి డిమాండ్

ప్యారీస్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలకు వృత్తి పన్ను చట్టాన్ని రద్దుచేయాలని పీఎంకే నేత అన్బుమణి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో గ్రామాల్లో నడుపుతున్న ఇడ్లీ దుకాణాలకు రూ.250 నుంచి రూ.50వేల వరకు డిపాజిట్ నిర్ణయించారని, అంతేకాకుండా లైసెన్సు దరఖాస్తు ఫీజుగా రూ.500 చెల్లించాలని ప్రకటించడం వల్ల చిరు వ్యాపారులు నష్టపోయే ప్రమాదముందన్నారు. సక్రమంగా ఫీజు చెల్లించి లైసెన్స్ పొందిన చిరు దుకాణాలకు రాష్ట్రప్రభుత్వం తరుపున ఎలాంటి రాయితీ, ఆర్థికసాయం అందజేయడం లేదని, అందువల్ల పెంచిన లైసెన్స్ ఫీజును తగ్గించి చిరువ్యాపారులను ఆదుకోవాలని అన్బుమణి రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నాంజిల్ సంపత్‌పై ఎండీఎంకే ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎండీఎంకే నేతలు, కార్యకర్తలు

వేలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, ప్రధాన కార్యదర్శి దురై వైగోపై విమర్శలు చేసిన నాంజిల్ సంపత్, బషీర్‌లపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా నేతలు ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి గోపి నేతృత్వంలో నిర్వాహకులు గుణశేఖరన్, బాబు శేఖర్, దేవరాజ్, దురైవేలు, ఇందుమతి తదితరులు ఎస్పీ కార్యాలయానికి ఊరేగింపుగా వచ్చి వినతిపత్రం సమర్పించారు.




23న అనిరుధ్ 'హుకుం' సంగీత విభావరి

రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సారథ్యంలో 'హుకుం' పేరుతో భారీ సంగీత విభావరి ఆగస్టు 23వ తేదీ జరుగనుంది. నగర శివారు ప్రాంతమైన ఈస్ట్ కోస్ట్ రోడ్ (ఈసీఆర్), కూవత్తూరులో ఉన్న 'మార్గ్ స్వర్ణ భూమి' అనే ప్రాంతంలో జరుగనుంది. గతంలో ఈసీఆర్‌లో జరిగిన ఏఆర్ రెహ్మాన్ సంగీత కచ్చేరి గందరగోళంగా మారిన నేపథ్యంలో అనిరుధ్ తన సంగీత కచ్చేరికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. విశాలమైన స్థలంలో వేలాది మంది సంగీత అభిమానుల భద్రత, పార్కింగ్ ఇత్యాది సౌకర్యాలపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ మ్యూజిక్ కచేరికి సంబంధించి టిక్కెట్ల విక్రయం ఆగస్టు 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు అధికారికంగా వెల్లడించారు.

అనిరుధ్‌ను కిడ్నాప్ చేయాలని వుంది

● విజయ్ దేవరకొండ



చిత్రజ్యోతి

యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌ను కిడ్నాప్ చేసి తనతో పాటు ఉంచుకోవాలని ఉందని టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన నటించిన కొత్త చిత్రం 'కింగ్డమ్' ఈ నెల 31న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇందులో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 'ఈ రోజు నా జీవితంలో ప్రత్యేకమైన రోజు 31వ తేదీన నేను నటించిన కొత్త చిత్రం విడుదలవుతుందన్నందుకు చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు గౌతం ఈ కథ వినిపించినపుడు తమిళంలో ఆయన తెరకెక్కించిన 'జెర్సీ' మూవీ గుర్తుకు వచ్చింది. ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో నిర్మించాలని నిర్ణయించుకున్నాం. ఏపీ - తమిళనాడు సరిహద్దుల్లో ఈ కథ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత శ్రీలంకలో సాగుతుంది. వీరందరి సంస్కృతి, భావోద్వేగాలు ఒకేలా ఉంటాయి. వీటికి యాక్షన్ జోడించాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి. తమిళ ప్రజలు అంటే నాకు అమితమైన ఇష్టం. అందుకే చెన్నైలో ప్రచారానికి వచ్చాను. ఈ సినిమా టీజర్ కోసం వాయిస్ ఓవర్ ఇచ్చిన హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనిరుధ్ అద్భుతమైన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశారు. పాత్రకోసం నా వంతు కృషి చేస్తాను. నా వరకు అన్ని లుక్‌లు ఒక్కటే. మా 'కింగ్డమ్' ఒక యాక్షన్, భావోద్వేగాల మిశ్రమం. తమిళ టీజర్‌కు హీరో సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు చెప్పగా, నేను సూర్యను కోరగా, ఆయన వెంటనే అంగీకరించారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇప్పటికీ దీని పనుల్లో బిజీగా ఉన్నాడు. అతడిని కిడ్నాప్ చేసి నాతోటే ఉంచుకోవాలని ఉంది. ఈ చిత్రం మా అందరికీ ఒక మైలురాయిగా నిలుస్తుంది అనిరుధ్ అన్నారు. ఆ మాటనే ఎంతో మంది షేర్ చేశారు. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

ఐశ్వర్య మీనన్ గ్లామర్ క్లిక్స్



తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషా చిత్రాల్లో బిజీ హీరోయిన్‌గా కొనసాగుతున్న ఐశ్వర్య మీనన్... సోషల్ మీడియా వేదికగా అందాలను ఆరబోస్తున్నారు.. ఈ క్రమంలో ఆమె తాజాగా ప్రత్యేక ఫొటో షూట్ నిర్వహించి ఆ ఫొటోలను ఆమె తన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. 2021లో చిత్ర రంగ ప్రవేశం చేసిన ఐశ్వర్య నటించిన తొలి చిత్రం 'కాదలిల్ సొదప్పదిల్ ఎప్పడి'. ఆ తర్వాత 'యాపిల్ పెన్నే' అనే చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. పిమ్మట 'తమిళపడం-2', 'నాన్ సిరిత్తాల్', 'వేళమ్' తదితర చిత్రాల్లో నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. అలాగే, తెలుగు, మలయాళం భాషా చిత్రాల్లో కూడా పలు చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె తన గ్లామర్ క్లిక్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయగా, వాటిని నెటిజన్స్ లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు.

'మదరాసి' కమ్‌బ్యాక్ మూవీగా ఉంటుంది

● ఏఆర్ మురుగదాస్



శివకార్తికేయన్ హీరోగా తాను రూపొందిస్తున్న 'మదరాసి' సినిమా తనకు ఒక కమ్‌బ్యాక్ మూవీగా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు ఏఆర్.మురుగదాస్ గట్టి విశ్వాసం వ్యక్తంచేశారు. ఆయన హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కించిన 'సికిందర్' మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో 'మదరాసి' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనిపై దర్శకుడు మురుగదాస్ మాట్లాడుతూ, 'ఈ మూవీ ఖచ్చితంగా నాకు ఒక కమ్‌బ్యాక్‌లా ఉంటుంది. సూర్య నటించిన 'గజని' సినిమా స్క్రిప్టు, విజయ్ 'తుపాకీ' మూవీ యాక్షన్ సమ్మేళనంతో ఈ మూవీని రూపొందిస్తున్నాను. అందుకే ఈ సినిమా అభిమానులకు సరికొత్త అనుభూతినిస్తుంది. 'మదరాసి' అనే పదాన్ని ఉత్తర భారతదేశంలో అత్యధికంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా తమిళులను ఉద్దేశించి ఈ పదం వాడుతారు. తద్వారా ఏర్పడే సమస్యలు ఏంటో ఇందులో చూపించాం. పైగా 'గజిని' మూవీలో హీరో సూర్యకు ఉన్నట్టుగానే ఇందులో శివకార్తికేయన్‌కు ఒక మానసిక సమస్య ఉంటుంది. ఈ సమస్యలను హీరో ఎలా అధిగమించారన్నదే ఈ చిత్ర మూలకథ' అన్నారు. కాగా, అనిరుధ్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రం సెప్టెంబరు 5వ తేదీన విడుదల చేసేలా ప్లాన్ చేశారు.

జాన్సన్ లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్

రూ.250 కోట్లతో విస్తరణ



మీడియా సమావేశంలో ఎండీ జగన్నాథన్ తదితరులు

చెన్నై, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): ఇళ్ళకు, కంపెనీలకు, రైల్వే ప్రాజెక్టులకు లిఫ్టులు, ఎస్కలేటర్లను తయారు చేయడంలో పేరొందిన జాన్సన్ లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్ సంస్థ టర్నోవర్ రూ.3వేల కోట్లకు చేరిందని, దీంతో సెంగాడు కర్మాగారంలో రూ.250 కోట్లతో విస్తరణ కార్యకలాపాలను చేపట్టనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.జగన్నాథన్ తెలిపారు. నగరంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పూందమల్లి, ఒరగడం, సెంగాడులోను, నోయిడా వద్ద సంస్థ కర్మాగారాలున్నాయని, సంస్థకు దేశవ్యాప్తంగా 80 బ్రాంచీలున్నాయని, ఇటీవల ప్రధాని మోదీ ప్రారంభించిన తూత్తుకుడి ఎయిర్‌పోర్ట్‌లోనూ తమ సంస్థ లిఫ్ట్ సదుపాయాన్ని కల్పించిందన్నారు. మీడియా సమావేశంలో సంస్థ జనరల్ మేనేజర్ వి. శివకుమార్, డైరెక్టర్ యోహాన్ కే జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాసాగ్రాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ సదస్సు



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాసాగ్రాండ్ ఇంటర్నేషనల్ స్కూలులో 'ఇంటర్నేషనల్ ఇండియన్ మూవ్‌మెంట్ టు యునైటెడ్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) తమిళనాడు కాన్ఫరెన్స్' పేరుతో నిర్వహించిన 14వ ఎడిషన్ ఇటీవల ఘనంగా ముగిసింది. భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరైన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి నటి కీర్తి పాండ్యన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. వెంకయ్య స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు సమకాలీన ప్రపంచ, జాతీయ సమస్యలపై యువత నేతృత్వంలోని సంభాషణకు వేదికగా నిలిచాయి. ఐఐఎంయూఎన్ వ్యవస్థాపకుడు రిషబ్ షా, ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి రాయబారి రుచిరా కాంబోజ్, స్కూలు కరస్పాండెంట్ డోరతి థామస్ తదితరులు ఈ సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సదస్సును నిర్వహించడం గర్వకారణమని, ఇది సమగ్ర విద్య పట్ల తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

చెన్నై డీఆర్ఎంగా శైలేంద్ర సింగ్



పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం)గా శైలేంద్ర సింగ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జబల్‌పూర్‌లోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన శైలేంద్ర సింగ్, ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఎస్ఈ)లో 1995 బ్యాచ్‌కు చెందిన వారు. సికింద్రాబాద్ అడిషినల్ డివిజనల్ మేనేజర్‌గాను, రైల్‌టెల్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. సిగ్నల్ వ్యవస్థ, టెస్టింగ్, సిగ్నల్ ఎక్విప్‌మెంట్ కమ్యూనికేషన్, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉంది.

హొగెనేకల్‌లో రెండోరోజూ తగ్గని వరద



కావేరివాగులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

చెన్నై, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతం వద్ద కర్ణాటక నుండి విడుదలవుతున్న నీరు చేరుతుండడంతో ఆ జలపాతం వద్ద వరద పరిస్థితి నెలకొంది.. కర్ణాటకలోని కృష్ణ రాజసాగర్, కబిని జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో కుండపోత వర్షాల కారణంగా ఆ జలాశయాల నుండి విడుదలైన అదనపు జలాలంతా హొగనేకల్ జలపాతంలోకి ప్రవేశిస్తున్నాయి. కర్నాటక - తమిళనాడు సరిహద్దులో బిలిగుండు మీదుగా కావేరి వాగులో జలాలు ప్రవేశిస్తుండటంతో ఆ ప్రాంతాల్లో వరద పరిస్థితి ఏర్పడింది. మంగళవారం ఉదయం హొగెనేకల్ జలపాతంలోకి నీరు రావడంతో సినీఫాల్స్, ఐందరువి తదితర ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధాన జలపాతానికి వెళ్లే కాలినడకదారిపై కూడా నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితులలో జలపాతం వద్దకు పర్యాటకులెవరూ వెళ్ళకుండా అధికారులు నిషేధ ఉత్తర్వులు జారీ చేశారు.

శంకరన్‌కోవిల్ ఆడితపస్సు ఉత్సవాలు

● 5న మహారథోత్సవం



టి.నగర్, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ శంకరనారాయణస్వామి ఆలయంలో ఆడి తపస్సు వేడుకల్లో భాగంగా మహారథోత్సవం ఆగస్టు 5న జరుపనున్నట్లు ఆలయనిర్వాహకులు ప్రకటించారు. శంకరన్‌కోవిల్ ఆలయంలో ప్రతియేటా 12 రోజులపాటు ఆడి తపస్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది ఆడి తపస్సు ఉత్సవాలు ఆలయంలోని గోమతి అమ్మవారి సన్నిధిలో స్వర్ణ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఆలయంలోని కళైఅరంగంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, పట్టిమండ్రం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానమట్టమైన రథోత్సవం ఆగస్టు 5న, ఆడి తపస్సు వేడుకలు ఆగస్టు 7న జరుగనున్నాయి.

గుడారం నమూనాలో ఎన్నూర్ బస్టాండ్



తుది దశలో బస్టాండ్ నిర్మాణపనులు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నూర్ బస్టాండ్ రూ.4 కోట్లతో గుడారం నమూనాలో నిర్మితమవుతోంది. ఎన్నూర్ బస్టాండ్ నుంచి వళ్లలార్ నగర్, ఎగ్మూర్, హైకోర్టు తదితర ప్రాంతాలకు ప్రతిరోజు 50కి పైగా ఎంటీసీ బస్సులు నడుపుతున్నారు. ఈ క్రమంలో, పాత బస్టాండ్ రోడ్డు కంటే దిగువలో ఉండడంతో, చిన్నపాటి వర్షానికే బస్టాండ్‌లో భారీగా నీరు చేరుతోంది. అలాగే, వర్షపు నీటితో మురికి నీరు కలుస్తుండడంతో బస్టాండ్ ప్రాంతం దుర్వాసన చెందుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) 'నమక్కు నామే' పథకంలో, రూ.4 కోట్లతో కొత్త బస్టాండ్ నిర్మాణాలు చేపట్టింది. వచ్చే నెల 15వ తేదిలోపు పనులు ముగించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

నేటినుంచి 'రియల్‌మి 15' రాయితీలు



రాయితీలను వివరిస్తున్న అంబుజ శ్రీవాత్సవ

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మొబైల్ రంగంలో ప్రసిద్ధి చెందిన 'రియల్‌మి 15' సిరీస్ విక్రయాల్లో రాయితీలు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రొడక్ట్ సీనియర్ మేనేజర్ అంబుజ్ శ్రీవాస్తవ్ మంగళవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. భారతీయ యువతలో అత్యంత ప్రజాదరణ పొందిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా రియల్‌మి నిలవడం సంతోషంగా వుందన్నారు. తాజాగా రియల్ మి 15 ప్రొ 5జి, రియల్ మి 15 5జిలను తమిళనాడు మార్కెట్లోకి విడుదల చేశామన్నారు. ఇది ఏ1 పార్టీ ఫోన్‌గా నిలిచిందని, ఇది కెమెరా ఎక్స్‌లెన్స్ అధునాతన కొత్త బెంచ్‌మార్క్ నిర్దేశిస్తుందని వివరించారు. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మి వెబ్‌సైట్లతో పాటు షోరూంల్లోనూ రాయితీలతో మొబైల్‌ఫోన్లు అందుబాటులో ఉంచామన్నారు.

హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూల్లో అట్టహాసంగా 'ఇన్నోవిజ్ -2.5 వేడుకలు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పడూరులోని హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూలులో 'ఇన్నోవిజ్ 2.5' పేరిట ఇంటర్ స్కూల్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 12 సుప్రసిద్ధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, పబ్లిక్ స్పీకింగ్,ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్ తదితర 21 ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఎజే ఫెర్నాండెజ్, ఆయన సతీమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హిందూస్థాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ విజేతలకు బహుమతులు అందజేశారు. నేపథ్య గాయని ప్రణీత సంగీత విభావరితో ఈ వేడుకలు ముగిశాయి.



విజేతలకు బహుమతులందజేస్తున్న ఓటీసీ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఎజే ఫెర్నాండెజ్

నామక్కల్‌లో సీబీసీఐడీ తనిఖీలు

అడయార్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లో ఒక ఫైనాన్స్ కంపెనీ యజమాని ఆత్మహత్య వ్యవహారంలో సీబీసీఐడీ పోలీసులు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. నామక్కల్ తిరునగర్‌కు చెందిన పళనిస్వామి (77) ఫైనాన్స్ కంపెనీ నడిపేవారు. అయితే, ఆయన హఠాత్తుగా తన ఇంటిలోనే ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై నామక్కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మృతుని ఇంటిలో 4 పేజీల సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదంటూ పళనిస్వామి భార్య వసంత మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారణకు స్వీకరించిన కోర్టు సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీబీసీఐడీ పోలీసులు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న అడ్వకేట్ అయ్యావు కార్యాలయం, నివాసాలు కూడా ఈ సోదాలు చేసిన స్థలాల్లో ఉన్నాయి.

మూలకొత్తలంలో ఆక్రమణల తొలగింపు

అడయార్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాయపురం జోన్‌లోని మూలకొత్తలం ప్రాంతంలోని ఆక్రమణలను చెన్నై నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం పోలీసులు భద్రతతో తొలగించారు. ఈ జోన్‌లోని 53వ వార్డుతో పాటు మూలకొత్తలం బేసిన్ బ్రిడ్జి రోడ్డు తదితర ప్రాంతాల్లో దాదాపు 200కుపైగా ఆక్రమణలున్నాయి. వీటిని తొలగించాలని ఆక్రమణదారులను పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోలేదు. దీంతో పోలీసుల రక్షణలో కార్పొరేషన్ అధికారులు ఈ ఆక్రమణలను తొలగించారు. దీంతో 20 కుటుంబాలకు చెందిన ప్రజలు రోడ్డు రోకోకు దిగడంతో ప్రత్యామ్నాయస్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పుదుచ్చేరిలో కొనసాగుతున్న రవాణా కార్మికుల సమ్మె

పుదుచ్చేరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రితో జరిపిన చర్చలు విఫలం కావడంతో రవాణా సంస్థ కార్మికులు సమ్మె కొనసాగించాలని నిర్ణయించారు. కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి ప్రభుత్వం 'పీఆర్‌టీసీ' పేరుతో తమిళనాడు, ఆంధ్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు వంద బస్సులు నడుపుతోంది. పీఆర్‌టీసీలో 220 మంది శాశ్వత, 250కి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు. 2015 నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వేతన పెంపు తదితర డిమాండ్లతో ఏప్రిల్‌లో కార్మికులు సమ్మె చేయగా, కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన ప్రభుత్వం, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం హామీ ఇచ్చి మూడు నెలలు దాటినా సమస్య పరిష్కరించలేదంటూ పీఆర్‌టీసీ కార్మికులు ఆదివారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ నేపథ్యంలో సీఎం రంగస్వామి నేతృత్వంలో మంగళవారం రవాణా కార్మిక సంఘాలతో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో, సమ్మె కొనసాగించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి.. కాగా, ప్రజల సంక్షేమార్థం సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని ప్రభుత్వం కార్మికులకు విజ్ఞప్తి చేసింది.

ఎకోలక్స్ డైమండ్ జువెలరీ షోరూం ఆవిష్కరణ

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలో ఎకోలక్స్ షోరూంను నటి తేజస్వి మదివాడ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్‌మెడల్ డైరెక్టర్ అంజుదేవి, సేవా భారతి సంయుక్త కార్యదర్శి నాగలక్ష్మిపతి, ఫిక్కీ ఫ్లో సభ్యురాలు లలిత పతి, కన్స్యూమర్ కోర్టు మీడియేషన్ సభ్యులు సౌజన్య కంచెర్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అత్యధిక నైపుణ్యం, డిజైన్లలో అత్యుత్తమ స్థాయి, ఆభరణాలు ఎల్లప్పుడూ విలాసవంతమైనవని వివరించారు. ఎకోలక్స్ జువెలరీలో ఉంగరాలు, గాజులు, బ్రాస్‌లెట్లు, నెక్లెస్‌లు, చెవిపోగులు వంటి వజ్రాల బంగారు ఆభరణాల సేకరణ కూడా ఉందని, వచ్చే ఏడాది లోగా 10 రిటైల్ దుకాణాలను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా వజ్రాల ధరలపై 30 శాతం, తయారీ చార్జీలపై 50 శాతం తగ్గింపు అందిస్తున్నామని, ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు వుంటుందని వివరించారు.



షోరూం ప్రారంభిస్తున్న దృశ్యం

భద్రకాళియమ్మన్ ఆలయంలో ఆడిపూరం వేడుకలు






కలశాలను ఆలయానికి తరలిస్తున్న భక్తులు

తిరుత్తణి, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి అనుసంధానమైన భద్రకాళియమ్మన్ ఆలయంలో ఆడిపూరం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు మంగళవారం విశేష అభిషేక పూజలు నిర్వహించారు.ఈ క్రమంలో ఉదయం 9 గంటలకు అర్చకుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల దివ్యనామస్మరణలతో 201 మంది మహిళలు క్షీర కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్ళారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు.. మధ్యాహ్నం 12గంటలకు విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సిద్ధమవుతున్న వినాయక ప్రతిమలు

పెరంబూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక ప్రతిమల తయారీ ఊపందుకుంది. ఆగస్టు 27వ తేది ఈ ఏడాది వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఇళ్లలో చిన్న వినాయక ప్రతిమలు ఉంచి పూజలు చేస్తుంటారు. హిందూ సంస్థలు, యువజన సంఘాలు తమ తమ వీధుల్లో పందిళ్లు వేసి వినాయక విగ్రహాలు పెట్టి పూజలు నిర్వహించి, ఆ తరువాత ఊరేగింపుగా తీసుకెళ్లి జలాశయాల్లో నిమజ్జనం చేస్తుంటారు. ప్రస్తుతం నగర శివార్లలో ఉత్తరాది కార్మికులు గుడారాలు ఏర్పాటుచేసుకుని వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. పలు డిజైన్లు, రంగులతో రూపొందుతున్న విగ్రహాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3 నుంచి పదడుగుల ఎత్తు వరకు రసాయనాలు కలుపని సహజసిద్ధ రంగులతో విగ్రహాలు తయారుచేస్తున్నామని, ఇప్పటికే పలు సంఘాలు విగ్రహాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని వ్యాపారులు తెలిపారు.





● నేటి సాయం సంధ్య వేళ..

మల్బరీ పంట తొలగింపు


● అధికారి తీరుతోనే అన్న రైతు



జేసీబీతో మల్బరీ పంటను తొలగించిన రైతు

తిరుపతి రూరల్,జూలై29(ఆంధ్రజ్యోతి): సరైన ప్రోత్సాహం లభించడంలేదని తిరుపతి రూరల్ మండలం వేమూరులోని రైతు అయ్యప్పనాయుడు తన ఒకటిన్నర ఎకరాలోని మల్బరీ పంటను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పలమనేరు పట్టు పరిశ్రమ మార్కెటింగ్ అధికారి తీరుతో విసిగి ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో పనిచేసిన అధికారి నాణ్యమైన గూళ్లను గుర్తించి మంచి ధర వచ్చేలా కొనుగోలుదారులు, రైతులను సమన్వయం చేసేవారు. ఆ స్థానంలో వచ్చిన ప్రస్తుత మార్కెటింగ్ అధికారి పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు రైతులు ఇబ్బంది పడుతున్నారు. బయట ప్రాంతాల నుంచి నాణ్యమైన గూళ్లు వస్తున్నా సరైన ధరతో కొనడం లేదు. దీనికి మార్కెటింగ్ అధికారి సమన్వయలోపమే కారణం' అని వివరించారు. కాగా, గతవైసీపీ హయాంలో మల్బరీ సాగుకు ఎలాంటి ప్రోత్సాహమూ ఇవ్వలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించినా, మార్కెటింగ్ అధికారి సమన్వయలోపం తమకు శాపంగా మారిందని రైతులు అంటున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.44 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,044

తలనీలాలు సమర్పించినవారు: 28,478

'నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నాం. ఇది భూఉపరితల పరిశీలన, వాతావరణం మార్పుల అధ్యయనానికి ఉపయోగపడుతుంది. కేవలం 12 రోజుల్లోనే భూగోళమంతా తిరిగే సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఉపగ్రహంలో ఇస్రో ఎస్-బ్యాండ్, నాసా ఎల్-బ్యాండ్ పేలోడ్స్ అమర్చాం. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 40 రోజుల తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయి.

- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్

'గగనయాన్ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే పరిశోధనలు మొదలయ్యాయి. అందుకు అవసరమైన వెహికల్స్‌ను, ఆస్ట్రోనాట్ టీంను సిద్ధం చేస్తున్నాం.

- ఉన్నికృష్ణన్ నాయర్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్



చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ నారాయణన్, పక్కనే శాస్త్రవేత్తలు ఉన్నికృష్ణన్ తదితరులు

షార్‌లో రాకెట్ ప్రయోగం

సూళ్లూరుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సాయంత్రం 5.40 గంటలకు రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఇస్రో-నాసా ఉమ్మడిగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగ నేపథ్యంలో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. మన.. అమెరికా శాస్త్రవేత్తలతో పాటు ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. అన్నీ సజావుగా సాగితే నిర్దేశిత సమయంలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి చేర్చనున్నారు. మరోవైపు భద్రతను కట్టుదిట్టం చేశారు. జల మార్గంలో కోస్టల్ గార్డులచే.. షార్ చుట్టూ పక్కల అడవుల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో జల్లెడ పడుతున్నారు.

దేవాలయాల్లో పూజలు

తిరుమల/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి: జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం విజయవంతం కావాలంటూ రాకెట్ నమూనాతో మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. శ్రీవారి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్తా, చైర్మన్ పీఎస్ యశోద, సైంటిఫిక్ సెక్రటరీ జయంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడినీ దర్శించుకున్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రత్యేక పూజలు చేశారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి దర్శన ఏర్పాట్లు చేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

'ఫోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణలో లేని పిల్లలకు ప్రత్యామ్నాయ రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఫోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఫోస్టర్ అడాప్షన్ గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఫోస్టర్ కేర్ విధానం ద్వారా పిల్లలు మానవీయ విలువలతో పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సాధారణ కుటుంబ వాతావరణంలో జీవిస్తూ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానసిక సహాయ సేవలు పొందే హక్కును పొందుతారన్నారు. జిల్లా బాలల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఫోస్టర్‌కేర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అనర్హ తల్లిదండ్రులు, సంరక్షణలో లేని పిల్లలను గుర్తించి అర్హులైన కుటుంబాల వద్ద తాత్కాలికంగా, దీర్ఘకాలింగా ఉంచే ప్రక్రియను చేపడతారని వివరించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ వెంకట్రావు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఈవో కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయండి

జిల్లాలో పీ4 కార్యక్రమాన్ని వేగవంతం చేసి బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించి ఆగస్టు 4వ తేదీ నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను రీఓపెన్‌కు తావులేకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి అందించాలన్నారు. కాంట్రాక్టు, రోజువారీ కూలీలకు కనీస వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్

అదనపు కమాండెంట్‌కు పదోన్నతి

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీఎస్పీ 9వ బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా పనిచేస్తున్న ఎం.అరుణ్‌బోస్‌కు కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన్ను విశాఖలోని ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర హోమ్‌శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరలక్ష్మీ వ్రతానికి రేపు టిక్కెట్లు జారీ

తిరుచానూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు.భక్తులు నేరుగా వ్రతంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లను అధికారులు విడుదల చేయనున్నారు. ఆలయం కౌంటర్‌లో ఆగస్టు 7న కరెంట్ బుకింగ్‌లో 150 టిక్కెట్లు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారిమెట్టు మార్గంలో గజ బీభత్సం

● వరి, మామిడి తోటల ధ్వంసం ● గంటన్నర ఆలస్యంగా భక్తులకు అనుమతి



దెబ్బతిన్న అరటితోట



ధ్వంసమైన వరి పంట

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు మార్గంలో సోమవారం రాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. రాత్రి 8.30 గంటలకు 11 ఏనుగులు ఈ మార్గంలోని పంప్ హౌస్, మయూర డైరీ ఫామ్, శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో తిరుగుతూ భయాందోళన కలిగించాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సిబ్బందితో వెళ్లి డ్రోన్ల ద్వారా ఏనుగుల సంచారాన్ని గుర్తించారు. వీటిని శేషాచలం అడవుల్లోకి మళ్లించడానికి ప్రయత్నించారు. ఈలోగానే అవి సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో మేడసాని ఆనందనాయుడికి చెందిన మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. చెంచయ్య వరి పొలాన్ని తొక్కేశాయి. మంగళవారం ఉదయం 6.30 గంటలకు ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని తెలిశాక రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో సాధారణంగా రోజూ ఉదయం 5 గంటలకే భక్తులను అనుమతిస్తారు. ఏనుగుల సంచార సమాచారంతో 6.30 గంటలకు శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టుకు బస్సుల్లో అనుమతించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఈ ప్రాంతాల ప్రజలతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. ఏనుగుల కదలికల గురించి తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళల ఉచిత ప్రయాణంపై

మెరుగైన చర్యలు తీసుకోండి

● రవాణా మంత్రి, ఆర్టీసీ ఎండీ సూచన

తిరుపతి(ఆర్టీసీ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలుకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తూ, మెరుగైన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాపీఠంలో ఈ పథకం అమలుపై మంగళవారం జరిగిన తొలి సన్నాహక సమావేశంలో వీరు మాట్లాడారు. ఆక్యుపెన్సీరేషియో, లోడ్ పెరిగే క్రమంలో కొన్ని బస్సులు మొరాయించే అవకాశాలున్నాయన్నారు. బస్సుల సామర్థ్యం మెరుగుపరచాలని, ఫిట్‌గా ఉంటేనే గ్యారేజీ నుంచి బయటకు పంపాలని సూచించారు. విడిభాగాలను నిల్వ ఉంచుకోవాలని, మరమ్మతుల వల్ల ఆలస్యం కాకూడదన్నారు. కాలంచెల్లిన సాంకేతిక, ఇతర విడి భాగాలను తక్షణమే మార్చాలన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని సూచించారు. కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల డిపీటీవోలు, సీనియర్ ఆఫీసర్లు, డీఎంలు హాజరయ్యారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి, ఆర్టీసీ ఎండీ

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● అవగాహన సదస్సులో ప్రిన్సిపాళ్లకు వివరించిన ఆర్ఐవో



తిరుపతి(విద్య), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యావిధానంలో కొత్త సంస్కరణలపై అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించారు. తిరుపతిలోని టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ఐవో రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. సిలబస్ మార్పు, సబ్జెక్టుల కాంబినేషన్, ప్రశ్నపత్రంలో మార్పుల గురించి విశదీకరించారు. ఏపీఈఏపీసెట్, నీట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధంపై వివరించారు. ఇంటర్ విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసి గ్రూపులు తీసుకుంటున్నారన్నారు. ఈ గ్రూపు సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లిష్, పార్ట్-2లో ద్వితీయ భాషగా ఏదేని ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. ఎంపీసీ విద్యార్థులు అదనంగా 6వ సబ్జెక్ట్‌గా బయాలజీని, బైపిసి విద్యార్థులు మ్యాథమేటిక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. అదనపు సబ్జెక్టును ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలు ఏపీఈఏపీసెట్, నీట్ రెండింటికీ రాయవచ్చన్నారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బి సబ్జెక్టులను విలీనంచేసి మ్యాథమేటిక్స్‌గా, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను విలీనంచేసి బయాలజీగా ఈఏడాది ప్రథమ సంవత్సర విద్యార్థులకు అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్పులు వర్తిస్తాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాల నివృత్తికి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటికి తాళం కనిపిస్తే చాలు..!

● రాత్రికి దొంగతనం చేస్తాడు

● నిందితుడి అరెస్టు..

248.7 గ్రాముల బంగారు స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం),జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శ్రీకాళహస్తి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి తొమ్మిది కేసులకు సంబంధించి దాదాపు రూ.27 లక్షల విలువచేసే 248.7 గ్రాముల బంగారు నగలు, మూడు మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, బోడిగాడితోటకు చెందిన మీదూరి సునీల్ కొన్నేళ్లుగా చెడు వ్యసనాలకు లోనయ్యాడు. జల్సాల కోసం దొంగతనాలు మొదలు పెట్టాడు. రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలుచోట్ల దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో నెల్లూరు జిల్లా పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో సుమారు 28 కేసులు నమోదయ్యాయి. కొన్ని చోట్ల రిమాండుకూ వెళ్లాడు. ఇతడిపై నెల్లూరు టూటౌన్ స్టేషన్‌లో డీసీ షీట్ నమోదైంది. ఆ తర్వాత శ్రీకాళహస్తి ఒకటవ, రెండవ పోలీసుస్టేషన్లతో పాటు బీఎన్ కండ్రిగ, నాయుడుపేట, గూడూరు పోలీసుస్టేషన్ల పరిధిలో దాదాపు తొమ్మిది ఇళ్లల్లో దొంగతనం చేశాడు. తాళం వేసి వున్న ఇళ్లను గమనించి రెండు, మూడు రోజులు రెక్కీ నిర్వహిస్తాడు. ఆ తర్వాత ఇంటి తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో చోరీల కేసులను ఛేదించడానికి ఎస్పీ హర్షవర్ధన రాజు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో వన్‌టౌన్ సీఐ గోపి, తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకరయ్య, అరుణ్‌కుమార్, భరత్, బాలకృష్ణ, బాబు, గంగాధర్, చటర్జీలతో ప్రత్యేక బృందాలను నియమించారు. వీరు రెండు నెలలుగా ఇతడిపై నిఘా ఉంచారు. అతడి కదలికలను గుర్తుపట్టి సోమవారం నెల్లూరు పట్టణం, వెంకటేశ్వరపురం వద్ద సునీల్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి మూడు మోటరు సైకిళ్లతో పాటు దాదాపు 248.7 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందచేశారు.

రెండు నెలల్లో 75 మంది అరెస్టు

జిల్లావ్యాప్తంగా రెండు నెలల వ్యవధిలో జరిగిన చోరీలు, ఇంటి దొంగతనాలు, కన్నపు నేరాలకు సంబంధించి 75 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.10 కోట్ల చోరీ సొత్తు రికవరీ చేశారు. చోరీ కేసులు ఛేదించడానికి అనుభవజ్ఞులైన పోలీసు బృందాలను రంగంలోకి దింపడం, వారి పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెట్టడంతో ఆ బృందాలు కేసులను ఛాలెంజ్‌గా తీసుకుని రికవరీ చేయడంలో విజయం సాధించారు. ఈ ఏడాది చివరి నాటికి వివిధ కేసులకు సంబంధించి 70 శాతం డిటెక్టివ్‌తో 80 శాతం రికవరీ సాధిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఊర్లకు వెళ్లినప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జేఎన్‌టీయూ వీసీతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

స్కిట్ నేలను ముద్దాడుతున్న సుధీర్‌రెడ్డి

మంత్రి లోకేశ్ కృషితోనే 'స్కిట్' పునఃప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించగలిగామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి ఎంసెట్ కౌన్సిలింగ్‌లో స్కిట్ కళాశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో అనంతపురం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు స్కిట్ కళాశాలకు చేరుకున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కూటమి నేతలు కళాశాలను సందర్శించారు. ముందుగా కళాశాల ప్రాంగణం ప్రవేశద్వారం వద్ద నేలను ఎమ్మెల్యే ముద్దాడారు. స్కిట్ పునఃప్రారంభం ద్వారా తండ్రి (బొజ్జల గోపాలకృష్ణారెడ్డి) ఆశయాన్ని బతికించాడంటూ బృందమ్మ కుమారుడిని ఆలింగనం చేసుకున్నారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించాక ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విలేకరులతో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి స్కిట్ కళాశాల మూత ఓ నిదర్శనమన్నారు. తన తండ్రి స్థాపించిన కళాశాలను తిరిగి జేఎన్‌టీయూతో అనుసంధానం చేసి పూర్వవైభవం తీసుకొస్తానన్న హామీని నెరవేర్చడం మరచిపోలేని విషయమన్నారు. దీనికి మంత్రి నారా లోకేశ్ ఎంతగానో సహకరించారన్నారు. ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు శక్తివంచన లేకుండా శ్రమించారని అభినందించారు. రాబోయే రెండు మూడేళ్లలో గతం కన్నా రెట్టించిన స్థాయిలో స్కిట్ కళాశాలకు మంచిపేరుతో పాటు డిమాండ్ వచ్చేలా మెరుగైన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే తరగతి గదులను మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు, విజయకుమార్, కంఠా రమేష్, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఇంజనీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దుతాం

'స్కిట్‌ను అత్యున్నత విద్యాబోధనతో ఉన్నత కళాశాలగా తీర్చిదిద్దుతామని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు భరోసా ఇచ్చారు. తామంతా స్కిట్ కళాశాల ఖ్యాతిని చూసి గతంలో ఎంతో సంతోషపడేవారమన్నారు. కొన్ని అనివార్య కారణాలతో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి, నాలుగేళ్ల క్రితం కళాశాల మూతపడిన సమయంలో తామంతా ఎంతో కలత చెందామన్నారు. అంతటి కళాశాలను రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయిలో నిలబెడతామని చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

తిరుపతి(ఆటోనగర్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తొలినుంచీ ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి వెల్లడించారు. సూళ్ళూరుపేటలో ఆగస్టు 3న జరిగే సీపీఐ 2వ మహాసభల ప్రచార గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. జె.విశ్వనాథ్, కె.వై.రాజా, ఎన్.శివ, నాగరాజు, పద్మనాభరెడ్డి, కాశయ్య, రత్నమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.